క్లుప్తంగా

నేడు అఖిలపక్ష సమావేశం

దుగ్గొండి : స్థానిక సంస్థల ఎన్నికలను పురస్కరించుకుని నేడు (గురువారం) మండల పరిషత్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ లెక్కల అరుంధతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశం ఉదయం 11 గంటలకు జరుగుతుందని అన్నీ పార్టీల అధ్యక్షులు హాజరు కావాలని కోరారు. సమావేశంలో స్థానిక ఎన్నికలు, ఓటరు జాబితా వివరించడం జరుగుతుందని ఆమె పేర్కొన్నారు.

వాటర్‌కూలర్ బహూకరణ



నర్సంపేట రూరల్ : పట్టణంలోని జిల్లా పరిషత్ సెకండరీ (బాలుర) పాఠశాల విద్యార్థులకు రాబోయే వేసవి కాలంలో చల్లని నీరు తాగేందుకు రూ. 25వేల విలువ చేసే వాటర్ కూలర్‌ను చెన్నారావుపేటకు చెందిన గాదెగోని సదయ్య జ్ఞాపకార్థం వారి కుమారులు రాజు-సంధ్య దంపతులు స్కూల్ హెచ్ఎం, ఎంఈఓ కొర్ర సారయ్యకు బుధవారం అందించారు. ఈ సందర్భంగా సారయ్య మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి గొప్పవారు కావాలని, పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలన్నారు. వాటర్ కూలర్‌ను అందించిన రాజును అభినందించారు.కార్యక్రమంలో వైభవ్‌శ్రీనివాస్, వైష్ణవ్‌శ్రీరాం, చిరంజీవి, విక్రమ్, నవీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరామర్శ

గీసుకొండ : వరంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు చింతం సదానందం తల్లి వెంకటలక్ష్మి ఇటీవల మృతి చెందగా బుధవారం మొగిలిచర్లలోని వారి స్వగృహంలో తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం మాజీ ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ముద్దసాని సహోదర్‌రెడ్డిలు పరామర్శించారు. ఈ సందర్భంగా వెంకటలక్ష్మి చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. వారి వెంట బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఇసుక అక్రమంగా నిల్వ చేస్తే చర్యలు

నల్లబెల్లి : అనుమతులు లేకుండా ఇసుక తరలించినా, నిల్వ చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై గోవర్ధన్ అన్నారు. పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేకంగా పోలీస్ టీం ఏర్పాటు చేశామని అన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు లేకుండా వేర్వేరు ప్రాంతాల నుంచి ఇసుకను తరలించే వారిపై, అక్రమంగా నిల్వ చేసేవారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇసుక అక్రమ రవాణా సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

విద్యార్థినులకు ఆర్థిక అంశాలపై అవగాహన



పర్వతగిరి : స్థానిక సాంఘీక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో బుధవారం గవర్నమెంట్ ఆఫ్ ఇండియా పీఎంశ్రీ యోజన ఫేస్-2లో భాగంగా ప్రిన్సిపాల్ పి.అపర్ణ ఆధ్వర్యంలో పంజాబ్ నేషనల్ బ్యాంకు మేనేజర్ ఎల్.జనార్ధన్, అసిస్టెంట్ మేనేజర్ కె.తిరుపతి విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బేసిక్స్ ఆఫ్ బ్యాంకింగ్, సేవింగ్స్, డిజిటల్ అంశాలు, యూపీఏ అవేర్‌నెస్, స్మార్ట్ బడ్జెట్‌ప్లానింగ్, అండర్‌స్టాండింగ్ లోన్స్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్స్, ఇన్సూరెన్స్ అంశాలపై వివరించారు.

వివాహిత అదృశ్యం



సుకన్య

కమలాపూర్ : స్థానిక పోలీస్ స్టేషన్ బుధవారం మిస్సింగ్ కేసు నమోదైంది. సీఐ హరికృష్ణ కథనం ప్రకారం.. సంగెం మండలం పల్లారుగూడకు చెందిన మహేందర్ కమలాపూర్‌లో ని వాసముంటూ ఓ గ్రానైట్ కంపెనీలో జేసీబీ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో అతడి భార్య పోడేటి సుకన్య భర్తతో గొడవపడి ఇంట్లో నుంచి ఈనెల 10న తన ముగ్గురు పిల్లలతో సహా వెళ్లిపోయింది. బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. భర్త మహేందర్ ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బీజేపీలో చేరిన న్యాయవాది

పరకాల : పట్టణానికి చెందిన మహిళా న్యాయవాది వేముల సంధ్యారాణి బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు శ్రీధర్, శ్రీరాములు సమక్షంలో బుధవారం బీజేపీలో చేరారు. పట్టణంలో పార్టీ బలోపేతానికి కృషిచేస్తానని ఆమె తెలిపారు. పట్టణ అధ్యక్షుడు నిరంజన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గురుప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ జయంతిలాల్, భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి వైపు అడుగులు

- సీసీ రోడ్లకు నిధుల మంజూరు
- ఎస్సీ కాలనీల్లో నిర్మాణాలకు శ్రీకారం
- తీరనున్న ప్రజల కష్టాలు



మంగళవారిపేటలో నిధుల మంజూరు జీఓలను చూపుతున్న నాయకులు (ఫైల్)

ఖానాపురం : గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఎస్సీ కాలనీల్లో అంతర్గత రోడ్లను నిర్మించి ప్రజల కష్టాలు తీర్చడానికి శ్రీకారం చుట్టనున్నారు. ఎన్నికల కోడ్ ఉండడంతో కాస్త బ్రేక్ పడినప్పటికీ కోడ్ ముగిసిన వెంటనే నిర్మాణాలను ప్రారంభించడానికి ఆయా గ్రామాల్లో అధికారులు సమాయత్తం అవుతున్నారు. పంచాయతీరాజ్ శాఖ నుంచి ఎస్సీ లొకాలిటీస్ కింద మంజూరు కావడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఖానాపురం మండలంలోని పలు గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలకు నిధుల మంజూరయ్యాయి. పంచాయతీరాజ్ శాఖ ద్వారా గ్రామాల్లోని ఎస్సీ కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణాల కోసం నిధులు మంజూరు అయ్యాయి. ఆ నిధులతో సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టనున్నారు. కానీ ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్నందున పనులకు బ్రేక్ పడింది. కోడ్ ముగిసిన వెంటనే అధికారులు అగ్రిమెంట్‌లు పూర్తయిన తర్వాత పనుల ప్రారంభానికి శ్రీకారం చుట్టనున్నారు. ఈ నిధులు 2025 జనవరి 31న పంచాయతీరాజ్ శాఖ నుంచి ఎస్సీ లొకాలిటీ గ్రాంట్ కింద మంజూరయ్యాయి. ఖానాపురం గ్రామానికి రూ.55 లక్షలు, ధర్మరావుపేట రూ.31 లక్షలు, బుధరావుపేట రూ. 20 లక్షలు, చిలుకమ్మనగర్ రూ.15 లక్షలు, కొత్తూరు రూ.5 లక్షలు, మంగళవారిపేట రూ.23లక్షలు, రాగంపేటకు రూ.5లక్షలు, రంగాపురం రూ.6 లక్షలు, అశోక్‌నగర్‌కు రూ. 35 లక్షలు, దబ్బీర్‌పేటకు రూ.13 లక్షలు, మనుబోతులగడ్డకు రూ.6 లక్షలు, పెద్దమ్మగడ్డకు రూ. 5లక్షలు మంజూరయ్యాయి.

కోడ్ ముగిస్తే పనులు ప్రారంభిస్తాం

గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలకు నిధుల మంజూరయ్యాయి. ఈ నిధులతోనే ఆయా గ్రామాల్లో పనులు ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్నాం. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున పనులు ప్రారంభించలేదు. కోడ్ ముగిసిన తర్వాత అగ్రిమెంట్లు పూర్తి చేసుకొని పనులు ప్రారంభిస్తాం.

– మోహన్‌రావు, పీఆర్ డీఈ

హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలం

- బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సారంగపాణి



సమావేశంలో మాట్లాడుతున్న సారంగపాణి

నల్లబెల్లి : ప్రజలను మోపగించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చడంలో విఫలమైందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బానోత్ సారంగపాణి అన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరు సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్లు రాబట్టే ఆలోచనతో ప్రభుత్వం ప్రజాపాలన గ్రామ సభలు నిర్వహించి పథకాలు అందిస్తామని గొప్పలు చెప్పిందని ఆరోపించారు. స్కీంలు అందించిన చరిత్ర బీఆర్ఎస్‌కు ఉంటే.. స్కాముల చరిత్ర కాంగ్రెస్ పార్టీకి ఉందని గుర్తు చేశారు. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డిని విమర్శించే హక్కు కాంగ్రెస్ నాయకులకు లేదన్నారు. 15 నెలలో నియోజకవర్గంలో ఎమ్మెల్యే మాధవరెడ్డి చేసిన అభివృద్ధి ఏమిటో ప్రజలకు బహిరంగా ప్రకటించాలన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ బలపరిచి అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు. సమావేశంలో మాజీ ఎంపీపీ కక్కెర్ల శ్రీనివాస్ గౌడ్, బీఆర్ఎస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు ఊడుగుల ప్రవీణ్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి కోటిలింగాచారి, క్లస్టర్ ఇంచార్జ్‌లు శ్రీనివాస్‌గుప్తా, శివాజీ, మోహన్ రెడ్డి, నానబోయిన రాజారాం,చేరాలు పాల్గొన్నారు.

రక్షణకు దోమ తెరలు వాడాలి



డెంగీ సోకిన వ్యక్తి ఇంటి వద్ద దోమల మందు పిచికారీ చేయిస్తున్న వైద్యాధికారి కిరణ్‌రాజు

దుగ్గొండి: దోమల నుంచి రక్షణ పొందడానికి దోమ తెరలు వాడటంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల వైద్యాధికారి కిరణ్‌రాజు అన్నారు. మండలంలోని నారాయణతండాలో ఓ వ్యక్తికి డెంగీ నిర్ధారణ కావడంతో ఆయన బుధవారం గ్రామంలో పర్యటించారు. జ్వర బాధితుల వివరాలు సేకరించారు. 60 ఇళ్లలో ప్రత్యేక మలేరియా అధికారి నందా పర్యవేక్షణలో దోమల మందు పిచికారీ చేయించారు. అనంతరం జ్వరాల నుంచి రక్షణ పొందడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. డాక్టర్ భరత్, హెచ్ఈఓ సాంబయ్య, సీహెచ్ఓ సలోమి, పీహెచ్ఎన్ మనోజ, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలి



సమావేశంలో మాట్లాడుతున్న చాడ శ్రీనివాస్‌రెడ్డి

నర్సంపేట: ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపర్చిన అభ్యర్థి పులి సరోత్తంరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర నాయకుడు వన్నాల శ్రీరాములు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, నర్సంపేట ఎమ్మెల్సీ ఇన్‌చార్జ్ చాడ శ్రీనివాస్‌రెడ్డి కోరారు. పట్టణంలోని వాసవి కళ్యాణ మండపంలో బుధవారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కన్వీనర్ కట్ల రామచందర్‌రెడ్డి, గుడిపూడి రాధాకృష్ణ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి, జిల్లా ఎమ్మెల్సీ ఇన్‌చార్జ్ బైరి మురళికృష్ణలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పులి సరోత్తంరెడ్డి గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ వడ్డేపల్లి నర్సింహారాములు, జిల్లా ఉపాధ్యక్షుడు రేసు శ్రీనివాస్, రాష్ట్ర ఓబీసీ మోర్చా అధికార ప్రతినిధి గడ్డం ఆంజనేయులు, జిల్లా కార్యదర్శి తడుక అశోక్, సీనియర్ నాయకులు ఠాకూర్ రవీందర్‌సింగ్, మల్లయ్య, ఆయా మండలాల అధ్యక్షులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలి



ఖానాపురం : గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు దాతలు సహకరించాలని ఎస్సై చాగర్ల రఘుపతి అన్నారు. మండలంలోని అశోక్‌నగర్‌లో దాతల సహకారంతో సోలార్ సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు అవసరమన్నారు. ప్రతీ గ్రామంలో ఏర్పాటు చేసుకోవడానికి దాతలు సహకరించాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పోడుపట్టాలకు రైతు భరోసా అందించాలి



ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఖానాపురం : మండలంలోని మంగళవారిపేట పరిధిలోని పోడు పట్టాలు కలిగిన రైతులకు రైతుభరోసా ఇవ్వాలని మాజీ జెడ్పీటీసీ గుగులోతు బాలునాయక్, మాజీ సర్పంచ్ బాదావత్ బాలకిషన్ కోరారు. ఉమ్మడి మంగళవారిపేట పరిధి రైతులకు రైతుభరోసా మంజూరు చేయాలని కోరుతూ ఆర్డీఓ కార్యాలయంలో బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోడు పట్టాలు కలిగిన గిరిజన రైతులకు రైతుభరోసా మంజూరు చేయకపోవడం బాధాకరమన్నారు. అత్యంత వెనుకబడిన గిరిజన రైతాంగంపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. కార్యక్రమంలో నాయకులు భూక్య వెంకన్న, బానోతు శ్రీనివాస్, గుగులోతు అశోక్, భిక్షపతి, కీరు, కిషన్, రమేశ్, వెంకన్న, కిషన్, కోటి, రైతులు పాల్గొన్నారు.

ఆరోగ్య సమావేశాలు నిర్వహించాలి



చెన్నారావుపేట: గ్రామాల్లో ఆరోగ్య సమావేశాలు నిర్వహించాలని ఏపీఎం ఈశ్వర్ అన్నారు. స్థానిక గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ, ఆశాజ్యోతి మండల సమాఖ్య కార్యాలయంలో బుధవారం మానవ అభివృద్ధి సూచికలపై రెండో రోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది గ్రామాల్లోని సంఘాల ప్రతినిధులకు, వీఓఏలకు, శిక్షణ ఇచ్చామన్నారు. మహిళా సంఘాల ద్వారా ఆర్థికంగా అభివృద్ధిని సాధించినప్పటికి, సాధించిన ఆర్థిక ఫలాల్లో ఎక్కువ శాతం అనారోగ్యాలకు, వైద్య ఖర్చులకు వినియోగిస్తున్నారని అన్నారు. ఆరోగ్యంపై అందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో సీసీలు కట్టయ్య, మంజుల, మాణిక్యం, సుజాత, శ్రీలత, సంఘాల ప్రతినిధులు, వీవోఏలు, సిబ్బంది ఉన్నారు.

వైభవంగా వనజాతర ప్రారంభం

- గద్దెలపైకి చేరిన సారలమ్మ
- దర్శించుకున్న భక్తులు



సారలమ్మను తీసుకొస్తున్న పూజారి



నాగరాజుపల్లిలో మొక్కులు సమర్పిస్తున్న భక్తులు

నల్లబెల్లి: మండల కేంద్రంలోని సమ్మక్క–సారలమ్మ మినీ జాతర బుధవారం రాత్రి ఉత్సాహంగా ప్రారంభమైంది. సారలమ్మతో పాటు పగిడిద్దరాజు, గోవిందరాజులు కూడా గద్దెపైకి చేరారు. ముగ్గురు వన దేవతలు రావడంతో జాతర ప్రారంభమైంది. నల్లబెల్లిలోని ఆలయ గద్దెల ప్రాంగణాన్ని ముస్తాబు చేశారు. అలయ ప్రధాన పూజారి ప్రవీణ్ తల్లుల దేవాలయాన్ని శుద్ధిచేయగా ఆడపడుచులు రంగు రంగుల ముగ్గులు వేసి ఆలయన్ని ముస్తాబు చేశారు. డోలువాయిద్యాలతో గ్రామ శివారులోని ఎల్లమ్మతల్లి దేవాలయం సమీపం నుంచి మొంటె (వెదురు బుట్ట)లో పసుపు, కుంకుమ తీసుకుని నల్లబెల్లికి బయలుదేరారు. అప్పటికే అక్కడికి చేరుకున్న పగిడిద్దరాజు, గోవిందరాజులుతో కలిసి ముగ్గురు రాత్రి గద్దెలపై ప్రతిష్ఠించారు. సారలమ్మను తీసుకొచ్చిన పూజారులు వీరిపై నుంచి దాటి వెళ్లారు. ప్రత్యేక డోలు వాయిద్యాలు, శివసత్తుల పూనకాలతో ఆలయ ప్రాంగణం ఉప్పొంగింది.

నాగరాజుపల్లిలో మద్దిమేడారం ప్రారంభం

నల్లబెల్లి మండలంలోని నాగరాజుపల్లి మద్దిమేడారం మినీ జాతర బుధవారం ప్రారంభమైంది. తొలిరోజు భక్తులు వరాల తల్లుల ఆశీస్సుల కోసం కుటుంబ సమేతంగా జాతరకు చేరుకుంటున్నారు.. తల్లుల గద్దెల వద్ద మొక్కులు చెల్లించుకొని ఎత్తు బంగారం (బెల్లం) సమర్పించుకున్నారు. పలువురు భక్తులు తలనీలాలు ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. నాగరాజుపల్లి మాజీ సర్పంచ్ గొనె శ్రీదేవి కుటుంబ సభ్యులు తల్లులకు పట్టువస్త్రాలు సమర్పించేందుకు రాగా.. ఆలయ ప్రధాన పూజారి దురిశెట్టి సమ్మయ్య మంత్రోచ్ఛరణలు, బ్యాండు వాయిద్యాలతో స్వాగతం పలికారు.

కేవీకేను సందర్శించిన విద్యార్థినులు



యంత్రం పనితీరును వివరిస్తున్న డాక్టర్ రాజన్న

మామునూరు: మామునూరు కృషి విజ్ఞాన కేంద్రాన్ని వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రానికి చెందిన పీఎం శ్రీస్కూల్ విద్యార్థినులు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రం అందిస్తున్న సేవలు, అజోల్లా, చేపల పెంపకం, వర్మీ కంపోస్ట్ తయారీ, ప్లాస్టిక్ మల్చింగ్ పద్ధతిలో కూరగా యల సాగు, పెరటితోట, పెరటి కోళ్ల పెంపకం తీరును వారికి శాస్త్రవేత్తలు వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ రాజన్న, సౌమ్య, అరుణాజ్యోతి, రాజు, సాయికిరణ్, సాయిచంద్, శరత్, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణదారులపై చర్య తీసుకోవాలి

- ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కమిటీ సభ్యురాలు వంగల రాగసుధ



మునిసిపల్ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న ఎంసీపీఐ(యూ) నాయకులు

నర్సంపేట: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పట్టణంలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కమిటీ సభ్యురాలు వంగల రాగసుధ, డివిజన్ సహాయ కార్యదర్శి కొత్తకొండ రాజమౌళి డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని మునిసిపల్ కార్యాలయం ముందు బుధవారం ఆందోళన చేపట్టి అధికారులకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మునిసిపల్ అధికారులు కేవలం మామూళ్లకు అలవాటు పడ్డారని ఆరోపించారు. సామాన్య ప్రజలు ఒక ఇల్లు నిర్మాణం చేసుకోవాలంటే నెలల తరబడి మునిసిపల్ కార్యాలయం చుట్టూ తిరిగినా అనుమతి ఇవ్వకుండా, అదే డబ్బున్న బడాబాబులు డబ్బులు ఇవ్వగానే నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు ఇస్తూ యథేచ్ఛగా దోపిడీ కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. వెంటనే అక్రమ నిర్మాణాలను కూల్చి వేసి వారిపై చర్యలు తీసుకోవాలని, లేకుంటే దశలవారీగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంసీపీఐ(యూ) డివిజన్ నాయకుడు అనుమాల రమేశ్, విద్యార్థి సంఘం నాయకురాలు గణిపాక బిందు, టౌన్ నాయకులు బైరబోయిన నర్సయ్య, జన్ను విజయ, దొమ్మాటి విమల, జి.లక్ష్మి, జె.సమ్మక్క, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో విజ్‌డమ్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నర్సంపేట : హైదరాబాద్ రవీంద్రభారతిలో మంగళవారం జరిగిన రాష్ట్రస్థాయి ఇంగ్లీష్ స్పెల్ బీ పోటీల్లో పట్టణంలోని విజ్‌డమ్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చి నగదు బహుమతులు సాధించారు. రాష్ట్రస్థాయిలో వివిధ జిల్లాల నుంచి 70 పాఠశాలల విద్యార్థులు పోటీల్లో పాల్గొనగా విజ్‌డమ్ స్కూల్‌కు చెందిన పదో తరగతి విద్యార్థి అల్లి అర్జున్ రాష్ట్రస్థాయిలో సూపర్ సీనియర్స్ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి రూ.10,116 నగదు బహుమతితో పాటు ట్రోఫీ సాధించాడు. సూపర్ సీనియర్స్ విభాగంలో తొమ్మిదో తరగతికి చెందిన దీపక్ తృతీయ స్థానంలో నిలిచి రూ.2,116 నగదు బహుమతి, ట్రోఫీ, జూనియర్స్ విభాగంలో మూడో తరగతికి చెందిన రాయిడి హిమచరితారెడ్డి రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచి రూ.5,116నగదు బహుమతి, ట్రోఫీ కైవసం చేసుకుంది. వీరితో పాటు పదో తరగతికి చెందిన సాయికిరణ్, 7వ తరగతి రిత్విక, సమన్విత, 6వ తరగతి సాఫ్రిన్, మూడో తరగతి వాత్సల్య, రెండో తరగతి అర్జున్‌కృష్ణలు ప్రోత్సాహక బహుమతులను సాధించారు. బహుమతులను ప్రముఖ సినీ గేయ రచయిత, ప్రజాకవి జయరాజ్, గేయ రచయిత యస్బాల్, అక్షర నిర్మాణం ఫౌండేషన్ చైర్మన్ మంచాల నాగరాజు, నిర్మలా రాజన్ అందించారు. రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి పాఠశాల ప్రతిష్ఠను ఇనుమడింప చేసిన విద్యార్థులు, గైడ్ టీచర్ వీరభద్రయ్య, రాజేంద్రప్రసాద్, చెన్నస్వామి, దివ్యజ్యోతి, పృథ్వీ, సునీతలను బుధవారం పాఠశాల డైరెక్టర్ జావేద్, కరస్పాండెంట్ జహంగీర్, అకాడమిక్ ఇన్‌చార్జ్ నాజియా ఇక్బాల్, వైస్ ప్రిన్సిపాల్ ప్రకాశ్, ప్రీ స్కూల్ ప్రిన్సిపాల్ ఫహీం సుల్తాన, ఉపాధ్యాయులు అభినందించారు.

జేఈఈ ఫలితాల్లో ఆర్‌డీఎఫ్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పర్వతగిరి : జనవరిలో జరిగిన జేఈఈ మెయిన్స్ పరీక్షలో మండలంలోని కల్లెడ ఆర్‌డీఎఫ్ వనిత అచ్యుతపాయి విద్యాలయ జూనియర్ కళాశాల సుమారు 30 మంది విద్యార్థులు పరీక్ష రాసి అత్యుత్తమ ప్రతిభకనబర్చారు. రామవత్ సుమన్ 78.65, జాటోతు వెంకటేష్ 75.04, సిరిచందన 74.98 పర్సంటైల్ సాధించినట్లు ప్రిన్సిపాల్ జనార్ధన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, తల్లిదండ్రులు, ఆర్‌డీఎఫ్ మేనేజ్‌మెంట్‌ల సహకారం, ఉపాధ్యాయుల సరైన ప్రణాళికతో ఈ విజయం సాధ్యమైందన్నారు. ఈ సందర్భంగా బుధవారం విద్యార్థులను కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎ.రాజు, అధ్యాపకులు రాంబాబు, సంతోష్, మహేశ్వర్, సుధాకర్, సైదులు, జయశంకర్, శ్రీనివాస్, సతీష్ అభినందించారు.

సంత్ రవిదాస్ ఆశయాలను కొనసాగించాలి

- తెలంగాణ అంబేడ్కర్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జన్ను నర్సయ్య



సంత రవిదాస్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

వర్ధన్నపేట : దేశంలో మత సాంస్కృతిక ఉద్యమాల్లో దళిత బహుజనులను సామాజికంగా, రాజకీయంగా చైతన్యం కల్పించిన గొప్ప సాంస్కృతిక ఉద్యమ యోధుడు సంత్ రవిదాస్ మహారాజ్ అని ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ కొనసాగించాలని తెలంగాణ అంబేడ్కర్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జన్ను నర్సయ్య, జాతీయ యువజన అవార్డు గ్రహీత జక్కి శ్రీకాంత్ అన్నారు. బుధవారం పట్టణంలోని విజ్ఞాన కేంద్రంలో బహుజన ఆధ్యాత్మిక సిద్ధాంతాలపై చైతన్యపరిచిన సంతు రవిదాస్ మహారాజ్ 648వ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఈరెల్లి శ్రీనివాస్, జంగిలి భాస్కర్, జనగాం చంద్రమౌళి, నాగరాజు, రమేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఈటల రాజేందర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



ఎంపీ ఈటల రాజేందర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న రైతులు, బీజేపీ నాయకులు

పర్వతగిరి : గ్రీన్ ఫీల్డ్ హైవే బాధితులకు అండగా నిలిచి పార్లమెంట్‌లో వారి సమస్యలపై బుధవారం మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడినందుకు మండలంలోని ఏనుగల్లులో రైతులు ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర నాయకుడు, వరంగల్ అర్బన్ కో ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లాడి తిరుపతిరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు రవీందర్, బీజేపీ యువ నాయకుడు ఆదిత్యచిన్న, పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ కెనాల్‌లో మృతదేహం

పర్వతగిరి: తీగరాజుపల్లిలోని ఎస్సారెస్పీ కెనాల్ గేట్ వద్ద బుధవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని ఎవరైనా గుర్తుపడితే 8712685242, 8712685028 నంబర్లకు సమాచారం అందించాలని ఎస్సై ప్రవీణ్ కోరారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

నేడు వార్షికోత్సవ పూజలు

ఖానాపురం : స్థానిక ఆంజనేయస్వామి వద్ద నేడు (గురువారం)వార్షికోత్సవ పూజలు నిర్వహించనున్నట్లు అభయాంజనేయస్వామి కమిటీ బాధ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 8వ వార్షికోత్సవం సందర్భంగా ఉదయం 5.10 గంటలకు హోమ పూజలతో పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలను చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వరంగల్ రూరల్ :
9951602875 9553955722
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
డి. రాజు యాదవ్ (S.R) : 9502950309 (వర్ధన్నపేట)
కె. రమేష్ (S.R) : 9441304664 (నర్సంపేట)
పి.చంద్రశేఖర్ (A.C.O) : 9963646944